క్లుప్తంగా

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మంగళగిరి ఏడీఏ జి.శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని ఎరువులు, పురుగు మందుల షాపులను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే అటు వంటి షాపులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి షాపులో తప్పని సరిగా స్టాకు రిజిస్టార్, ధరల వివరాల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. ఓ దుకాణంలో అనుమతి పత్రాలు లేకుండా పురుగు మందులు విక్రయిస్తున్న విషయాన్ని గుర్తించి స్టాకును సీజ్ చేశారు. ఆయన వెంట ఏఓ కె.కిరణ్మయి ఉన్నారు.

మహిళా సాధికారతపై సదస్సు

గుంటూరు రూరల్: స్త్రీ అంటే ఒక శక్తి అని, మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య పేర్కొన్నారు. బుధవారం గోరంట్ల గ్రామంలోని కళాశాలలో విద్యార్థినులకు మహిళా సాధికారతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాలలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ ప్లకార్డులతో అవగాహన, కల్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్‌రోజ్, డీవీ రమణ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

చేబ్రోలు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. మండలంలోని వడ్లమూడికి చెందిన కర్రి శేషగిరి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడులు చేసి శేషగిరిని అదుపులోకి తీసుకున్నాడు. నిందితుడి వద్ద నుండి 13 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ప్రత్తిపాడు ఎక్సైజ్ ఎస్ఐ రవి తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు చెప్పారు.

హక్కుల వారోత్సవాలు.. మమ

- ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో మొక్కుబడిగా బాలల హక్కుల వారోత్సవాలు
- మొదటి రోజు, చివరి రోజు చేసి చేతులు దులిపేసుకున్న యంత్రాంగం
- షెడ్యూల్ ఘనంగా, ఆచరణ అధ్వానంగా



అనుబంధ శాఖలు లేకుండా బుధవారం ప్రత్తిపాడులో మొక్కుబడిగా ర్యాలీని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు

ప్రత్తిపాడు: బాలల హక్కుల వారోత్సవాలు మొక్కుబడిగా సాగాయి. ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల బాధ్యతా రాహిత్యంతో భంగపాటుకు గురయ్యాయి. వారం రోజుల పాటు రోజుకో కార్యక్రమం చొప్పున నిర్వహించాల్సిన వారోత్సవాలను ఒకటి, రెండు రోజులు చేసి మమ అనిపించారు. కనీసం అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా వారోత్సవాల షెడ్యూల్ ముగిసే రోజు వరకు తెలియదంటే సూపర్‌వైజర్లు మొదలు సీడీపీఓ వరకు కార్యక్రమంపై ఏ స్థాయిలో నిర్లక్ష్యం ప్రదర్శించారో చెప్పకనే తెలుస్తుంది.

లక్ష్యం ఏమంటే..

బాలల హక్కులు, సామాజిక దురాచారాలు, బాల్య వివాహాలు, వాటి వలన ఎదురయ్యే దుష్ప్రభావాలు, లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన.. వంటి అనేక విషయాలపై బాలలకు, తల్లులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా 14న చిల్డ్రన్స్ డే జరిపి బాలల హక్కులు, సామాజిక దురాచారాలు, బాల్య వివాహాల నిర్మూలణ, బాలల లైంగింక వేధింపులు, బాల కార్మికులు.. వంటి అంశాలపై మండల, గ్రామ స్థాయిల్లోని హైస్కూల్స్‌లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. 15న బాలల హక్కులు, బాల్య వివాహాల వలన ఎదురయ్యే దుష్ప్రభావాలపై సాంస్కృతిక కార్యక్రమాలు, వకృత్వ పోటీలు, 17న యోగా ప్రాముఖ్యత, 18న ప్లాంటేషన్ డ్రైవ్, 19న దత్తత, సంరక్షణపై పబ్లిక్ ప్రదేశాల్లో సోషల్ మొబిలైజేషన్ డ్రైవ్, 20న లైన్ డిపార్ట్ మెంట్స్‌తో కలిసి బాలల హక్కుల సంబరాలు, ర్యాలీలు చేయాల్సి ఉంది.

పత్తాలేని కార్యక్రమాలు..

ప్రాజెక్టు పరిధిలో 90 శాతానికి పైగా అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమాలు జరిగిన దాఖలాలు లేవు. తొలిరోజు బాలల దినోత్సవం సందర్భంగా అక్కడక్కడా పాఠశాలల్లో నిర్వహించిన వేడుకల్లో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. మరికొన్ని సెంటర్లలో అంగన్‌వాడీలు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి బాలల దినోత్సవం ముగించారు. ఇక తరువాత ఐదు రోజుల పాటు ఏ ఒక్క కేంద్రంలోనూ నిర్ణీత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను నిర్వహించలేదు. ఇక చివరి రోజు నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో మాత్రం మొక్కుబడిగా సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేసి మమ అనిపించేశారు. ఇక్కడ విచిత్రమేమిటంటే బాలల హక్కుల వారోత్సవాలకు సంబంధించిన షెడ్యూల్ కనీసం అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడా తెలియకపోవడమే.

చివరిరోజు బాగా చేయమన్నారు

ఈ నెల పద్నాలుగు నుంచి ఇరవై వరకు వారోత్సవాలు చేయమన్నారు. అయితే లాస్ట్ రోజు బాగా చేయమన్నారు. మిగిలిన రోజులు పాఠశాలల్లో కార్యక్రమాలు చేశారు. అవగాహనలు నిర్వహించారు.

–సీహెచ్ విజయ నిర్మల,
అడిషనల్ సీడీపీఓ, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు

మొదటి రోజు, చివరి రోజు చేశారు

వారోత్సవాలు ఏడు రోజుల పాటు చేయాల్సి ఉంది. తొలి రోజు అన్ని కేంద్రాల్లో చేశారు. మరలా చివరి రోజు కూడా ఇక్కడ ర్యాలీ చేశాం. మిగిలిన ఐదు రోజులూ కార్యక్రమాలు చేయలేదు. ఇక నుంచి కార్యక్రమాలు చేస్తాం.

– భారతి,
సూపర్‌వైజర్, ప్రత్తిపాడు సెక్టార్

పుస్తక పఠనంతో విజ్ఞానం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: మేధను పెంపొందించుకునేందుకు పుస్తక పఠనం ఎంతగానో దోహదపడుతుందని గ్రంథపాలకురాలు బి.అరుణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రంథాలయాలలో నిర్వహించిన వివిధ రకాల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామవార్డు సభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, టీడీపీ నాయకులు సీహెచ్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు రత్నాకరరావు, మణిరత్నం పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

కాకుమాను: గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథాలయ అధికారి జోగి మోహనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో అనేక రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని విద్యార్థులు, గ్రామస్తులు ప్రతి రోజు గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలను చదువుకోవాలన్నారు. పుస్తకం పఠనం ద్వారా ప్రపంచంలో జరిగే అనేక విషయాలను తెలుసుకోవచ్చునని వివరించారు. ఈసందర్భంగా పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

పొన్నూరులో..

పొన్నూరు: గ్రంథాలయాల్లో పుస్తక పఠనంతో విద్యార్థులు, యువత, పాఠకులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం పి. నరేష్‌కుమార్ అన్నారు. బుధవారం పొన్నూరు శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో పాత పొన్నూరులోని పాఠశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నీలోఫర్, జె.నీలిమ పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి జి. కృష్ణమోహన్ పర్యవేక్షించారు.

చిప్స్ కళాశాలలో..

గుంటూరు రూరల్: పుస్తక పఠనం అనేది మనిషిలోని జ్ఞానాన్ని పెపొందిస్తుందని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ తెలిపారు. బుధవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వేడుకలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్.గోపాలకృష్ణ పోటీలలో విజేతలను అభినందించారు.

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం చేయాలి

పెదకాకాని: ప్రతి ఒక్కరూ గ్రంథాలయంలో పుస్తక పఠనం చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రామ సర్పంచి గోళ్ల స్వరూపరాణి అన్నారు. పెదకాకాని లూథర్‌గిరికాలనీలో నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. అనంతరం వారం రోజుల పాటు నిర్వహించి ఆటల పోటీలు, వక్తృత్వం, డ్రాయింగ్ వంటి అంశాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ స్కూల్ హెచ్ఎం కొల్లిపర ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షిప్తం

• సులభ పద్ధతిలో విద్యాబోధన

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్యాబోధన చేపట్టాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈఓలు కె.ఎఫ్.కెనడీ, కె.విజయ్ భాస్కర్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.సాయన్న పాల్గొన్నారు.

• ఉచిత మెగా ఐ క్యాంప్

గుంటూరు రూరల్: కంటి సంబంధిత సమస్యలను నివారించేందుకు మొబైల్ వాడకాన్ని తగ్గించాలని కంటి శస్త్ర నిపుణుడు డాక్టర్ జి.రాజేష్ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని మాట్లాడారు. డాక్టర్ రాజేష్‌ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ కె.కృష్ణప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• శంకర కంటి ఆస్పత్రి వైద్యసేవలు

పెదకాకాని: శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత కంటి వైద్యసేవలు ప్రశంసనీయమని బొల్లు అజయ్‌ధీర్ అన్నారు. పెదకాకాని గ్రామంలోని ఉప్పాల ఫంక్షన్ హాలులో బుధవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన బొల్లు అజయ్‌ధీర్, తుమ్మల శివ రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరం ద్వారా 254 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 101 మందికి శుక్లాల ఆపరేషన్ చేయడానికి సిఫార్స్ చేశారు. ఈ శిబిరంలో శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ దీక్ష, క్యాంప్ ఇన్‌చార్జి శ్రీనివాస్ పాల్గొన్నారు.

• 'పది' ఫీజు అ'ధనం'పై విచారణ

ప్రత్తిపాడు: పదో తరగతి విద్యార్థుల నుంచి నిర్దేశించిన పరీక్ష ఫీజు కన్నా ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా కఠినంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుక స్పష్టం చేశారు. ప్రత్తిపాడు మండలంలో ఆరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్కానింగ్, ప్రింటింగ్, ఆన్‌లైన్ వర్క్, ఫొటోల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.25 నుండి రూ.150 వరకు పరీక్ష ఫీజు కన్నా అదనంగా వసూలు చేస్తున్నారంటూ బుధవారం 'సాక్షి'లో 'పది' ఫీజు అ'ధనం' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కథనంపై డీఈఓ స్పందించారు. అదనపు వసూలుపై విచారణ అధికారిని నియమించడం జరుగుతుందని, వసూలు నిజమని నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఈఓ ఒక ప్రకటనలో తెలిపారు.

• సర్వేను పరిశీలించిన డీపీఓ

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణ పంచాయతీ సర్వేలో భాగంగా మండలంలోని గొర్లవారిపాలెం గ్రామంలో జరుగుతున్న సర్వేను జిల్లా పంచాయతీ అధికారి బీవీ నాగసాయికుమార్ బుధవారం పరిశీలించారు. అధికారులు చేస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

• ఎన్జీ రంగా వర్సిటీ సందర్శన

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో నిన్న ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని న్యూఢిల్లీకి చెందిన యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్(యూఎస్‌డీఏ) సీనియర్ అగ్రికల్చరల్ స్పెషలిస్ట్ డాక్టర్ సంతోష్‌కుమార్ బుధవారం సందర్శించారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.శివన్నారాయణ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయం అధికారులతో రాష్ట్రంలో వ్యవసాయ స్థితిగతులు, విశ్వవిద్యాలయం పాత్ర తదితర అంశాలను గురించి చర్చించారు. విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారదజయలక్ష్మీదేవి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో వరి, వేరుశనగ, అపరాలు, చిరుధాన్యాలలో మారుతున్న వాతావరణ పరిస్థితులను తట్టుకుంటూ మేలైన దిగుబడులను రైతులకు అందించే పంటల రకాలను తయారు చేయటంలో విశ్వవిద్యాలయం ముందుందని తెలిపారు. పరిశోధన సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ, డాక్టర్ సంతోష్‌కుమార్‌సింగ్ వర్సిటీ ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, అగ్రికల్చర్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ డీన్ డాక్టర్ ఏవీ రమణ, కమ్యూనిటీ సైన్స్ డీన్ డాక్టర్ బీ శ్రీలక్ష్మి, ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఏ మణి, యూనివర్శిటీ లైబ్రేరియన్ డాక్టర్ పీ సాంబశివరావు పాల్గొన్నారు.

• ముగిసిన చెస్ టోర్నమెంట్

గుంటూరు రూరల్: క్రీడల ద్వారా విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గి పోటీ తత్వం పెరుగుతుందని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాందెడ్ల రామారావు తెలిపారు. నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల మహిళల, పురుషుల చదరంగం పోటీలు బుధవారంతో ముగిశాయి. పోటీలలో పురుషుల విభాగం నుంచి ఆర్‌వీఆర్ కాలేజీకు మొదటి, బాపట్లకు రెండో, చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మూడవ, చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసిటికల్ సైన్సెస్‌కు నాలుగవ స్థానాలు గెలుపొందారన్నారు. మహిళల విభాగంలో చలపతి ఫార్మసీ కళాశాలకు మొదటి, బాపట్లకు ద్వితీయ, ఆర్‌వీఆర్ అండ్‌జేసీకి తృతీయ, జేకేసీ కళాశాలకు నాలుగు స్థానాలు గెలుపొందారన్నారు.

చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

- జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి
- వట్టిచెరుకూరు మండలంలో కలెక్టర్ విస్తృత పర్యటన



అనంతవరప్పాడు హైస్కూల్లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి కోరారు. వట్టిచెరుకూరు మండలంలో బుధవారం కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. కోవెలమూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థుల హాజరు, అందిస్తున్న ఆహారం వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రక్షిత తాగునీటి చెరువు వద్ద నాటిన మొక్కలను పరిశీలించి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్‌కు సూచించారు.

• అనంతరం ముట్లూరులో నిర్మాణంలో ఉన్న పశువుల షెడ్‌ను పరిశీలించారు. లబ్ధిదారుడు పి.సుధాకర్‌తో మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.30 లక్షల అంచనా వ్యయంతో ఆరు పశువులు ఉండేందుకు వీలుగా షెడ్ నిర్మించుకుంటున్నానని, పది రోజుల్లో నిర్మాణం పూర్తవుతుందని లబ్ధిదారుడు కలెక్టర్‌కు వివరించారు.

• పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా అనంతవరప్పాడులో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు.

విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గింది..

అనంతవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య ఎంత అని హెచ్ఎం అరుణ కుమారిని ప్రశ్నించారు. గత ఏడాది 372 మంది కాగా, ఈ ఏడాది 302 మంది విద్యార్థులున్నారని హెచ్ఎం తెలిపారు. స్పందించిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిందని, వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెంచాలని ఆదేశించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. అదేవిధంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. బ్యాంక్ అకౌంట్ల ఈకేవైసీ, సర్వే, గృహాల జియో ట్యాగింగ్ పనుల పురోగతిపై కలెక్టర్ సచివాలయ సిబ్బందిని ఆరా తీశారు. ఆమె వెంట గుంటూరు ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి, డీఈఓ రేణుక, డ్వామా పీడీ శంకర్, ఎంపీడీఓ రమేష్‌బాబు, డీటీ దరియావలి పాల్గొన్నారు.

చెత్త సేకరణ లేదు.. వీధి దీపాలు వెలగవు



పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పంచాయతీ సెక్రటరీ ఖాజా

ప్రత్తిపాడు: గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించడం లేదు.. వీధి దీపాలు వెలగడం లేదు.. అంటూ వార్డు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచి రమాదేవి అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు సెక్రటరీపై ప్రశ్నల వర్షం కురిపించారు. వార్డులో చెత్త సేకరణ ఊసే లేదని, ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళుతున్నారో కూడా అర్థం కావడం లేదని చెప్పారు. అదే విధంగా వీధి దీపాల నిర్వహణ కూడా అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఒక్కో లైటు వెయ్యడానికి నాలుగు, ఐదు నెలలు ఎందుకు పడుతుందో ఎవ్వరికీ అర్థం కాని పరిస్థితిగా ఉందని ఉపసర్పంచి బాపతు వెంకటేశ్వరరెడ్డి సిబ్బంది తీరుపై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం తాగునీటి చెరువు కట్టపై ఉన్న వాటర్ ప్లాంటు అనుమతుల విషయమై సెక్రటరీ ఖాజాను ప్రశ్నించారు. ఆ ప్లాంట్‌కు అనుమతులు ఉన్నాయా? ఉంటే ఎప్పటి వరకు ఉన్నాయో చెప్పాలని కోరారు. అనుమతులు లేకుంటే, ముగిసిన నాటి నుంచి నేటి వరకు ప్లాంటు నుంచి నగదును రికవరీ చేయాలని కోరారు. స్పందించిన సెక్రటరీ ఇప్పటికే ప్లాంటు నిర్వాహకులకు ఒక నోటీసు జారీ చేశామని, మరో రెండు నోటీసులిచ్చి ఉన్నతాధికారులకు వేలంకు సిఫారసు చేస్తామని చెప్పారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణానికి ఆమోదం..

ప్రత్తిపాడు వడ్డెర కాలనీ సమీపంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ప్రత్తిపాడు పంచాయతీ ఆమోదం తెలిపింది. కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు రూ.20 లక్షలు నిధులు మంజూరు చేశారు. అయితే నిర్మాణానికి స్థానికంగా కొందరు టీడీపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని వార్డు సభ్యులు ఆమోదించారు. మొత్తం పదహారు మంది సభ్యులకు గాను పది మంది వార్డు సభ్యులు ఆమోదించడంతో పాటు అంగీకార పత్రాలపై సంతకాలు చేసి ఇవ్వడంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ అంశం ఆమోదించినట్లు సెక్రటరీ ఖాజా తెలిపారు.

ప్రేమజంటను వెంటాడిన విధి

- బస్సు రూపంలో భార్యను మింగేసిన మృత్యువు
- డ్యాన్స్ చేసుకుంటూ జీవనం సాగించే భర్తకు విరిగిన కాళ్లు



పావని (ఫైల్)



బస్సు ఈడ్చుకొచ్చిన స్కూటీ

పెదకాకాని: వారిద్దరు ప్రేమించుకున్నారు.. పెళ్లితో ఒక్కటయ్యారు.. వారి అనురాగానికి గుర్తుగా పాప కూడా జన్మించింది. కానీ ఇంతలో విధి వారిని వెంటాడింది. బస్సు రూపంలో వచ్చి భార్యను బలిగొంది. కల్చరల్ ప్రోగ్రాంలలో ఆమె పాటలు పాడుతూ, అతడు డ్యాన్స్ చేస్తూ జీవనం సాగించేవారు. ఇప్పుడు ఆమె గొంతు శాశ్వతంగా మూగబోయింది. అతడి కాళ్లు రెండూ విరిగిపోయాయి. ఆసుపత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడు.

ముందు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ప్రైవేటు బస్సు ఢీకొన్న సంఘటనలో ఆ వివాహిత దుర్మరణం పాలైంది. ఈ సంఘటన పెదకాకానిలో చోటు చేసుకుంది. పెదకాకాని గ్రామానికి చెందిన ఉయ్యాల శివకృష్ణ, పావనిలు రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వారికి ఏడాది వయసున్న పాప సంతానం. కల్చరల్ ప్రోగ్రాంలలో శివకృష్ణ డ్యాన్స్ చేస్తుంటాడు. భార్య పావని అలియాస్ జెస్సీ పాటలు పాడుతూ జీవనం సాగిస్తున్నారు. శివకృష్ణ జేకే ఈవెంట్స్ ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తున్నాడు. పెదకాకాని సదాశివ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం దంపతులు స్కూటీపై విజయవాడలో ప్రోగ్రాం కోసం బయలు దేరారు. పెదకాకాని సెంటర్‌కు వచ్చేసరికి వెనుక నుంచి అతివేగంగా నిర్లక్ష్యంగా బస్సు నడిపిన డ్రైవర్ ముందు వెళుతున్న స్కూటీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో పావని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. శివకృష్ణకు కాళ్లు విరిగిపోయాయి. స్కూటీని బస్సు సుమారు 50 మీటర్ల దూరం ఈడ్చుకెళ్లిందంటే బస్సు అతి వేగం అంచనా వేయొచ్చు. స్థానికులు ఈ ఘటనతో ఏం జరుగుతుందో అర్థం కాక భయంతో పెద్దగా కేకలు వేశారు. సమాచారం తెలుసుకున్న పెదకాకాని పోలీసులు వచ్చి తీవ్రంగా గాయపడిన శివకృష్ణను చికిత్స నిమిత్తం గుంటూరు ఆసుపత్రికి తరలించారు. పావని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

విజ్ఞాన్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌లకు బీ, సీ సర్టిఫికెట్లు పంపిణీ



సర్టిఫికెట్స్ పొందిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక

గుంటూరు రూరల్: క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ అని ఎన్‌సీసీలో మంచి ర్యాంకులతో, పరిజ్ఞానంతో ఆర్మీ కొలువులు సాధించవచ్చని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ, సీ సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నిర్వహించిన బీ, సీ పరీక్షల్లో తమ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్స్ నూరుశాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. పరీక్షల్లో ఉత్తీర్ణత పొందిన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఆర్మీ సుబేదార్ ఇమామ్ షేక్ సాహబ్ సర్టిఫికెట్స్ అందజేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ సిహెచ్.జ్యోతిప్రియ, సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థినులను అభినందించారు.

• పర్యావరణ పరిరక్షణకు కృషి

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డలో మాజీ ఉపసర్పంచి వంగా నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో బాపట్లకు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపసర్పంచి నామా శ్రీనివాసరావు పాల్గొన్నారు.